క్లుప్తంగా

నేడు పొంగుబాలు సమర్పణ


అమ్మవారి మూలవిరాట్

సంబేపల్లె : మండల పరిధిలోని మోటకట్ల గ్రామంలోని చిత్తూరు – కర్నూలు జాతీయ రహదారి పక్కన వున్న శ్రీ వెంకటశివ సాయి ఆలయ సముదాయంలో కొలువైన శ్రీ రాజేశ్వరమ్మకు నేడు (గురువారం) బోనాల (పొంగుబాలు సమర్పణ) మహోత్సవాన్ని నిర్వహిస్తున్నట్లు ఆలయ నిర్మాణకర్తలు బి.వి సుబ్బారెడ్డి కుటుంబీకులు వెంకటనాథ్‌రెడ్డి, రామచంద్రారెడ్డి, అమరనాథ్ రెడ్డి, జగన్నాథరెడ్డిలు తెలిపారు. భక్తులు ఉదయం సామగ్రితో ఆలయం వద్దకు రావాలని వారు కోరారు.

ఖరీఫ్ సాగును ఇ-క్రాప్ చేయించండి

సంబేపల్లె : మండల పరిధిలోని శెట్టిపల్లె గ్రామం అడవికమ్మపల్లె బుధవారం పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని మండల వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఏడీఏ శ్రీలత మాట్లాడుతూ ప్రస్తుత ఖరీఫ్‌లో వరికి సంబంధించిన కె.ఎన్.ఎం. 1638 రకాన్ని సాగు చేయాలన్నారు. అలసంద, నారాయణి రకం వేరుశనగ కాయలు అందుబాటులో వున్నాయన్నారు. ఖరీఫ్ సీజన్‌లో సాగు చేసిన పంటలను తప్పనిసరిగా ఇ–క్రాప్ చేయించుకోవాలన్నారు. అనంతరం రైతులకు పంటల సాగుపై సూచనలు, సలహాలు ఇచ్చారు. కార్యక్రమంలో మండల వ్యవసాయశాఖ అధికారి కిషోర్‌నాయక్, ఏఓ రమేశ్‌రాజు, వ్యవసాయ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయులకు సన్మానం



పెనగలూరు : మండలంలోని చక్రంపేట జిల్లా పరిషత్ హైస్కూల్‌లో బదిలీపై వెళ్లిన ఉపాధ్యాయులను బుధవారం ఘనంగా సన్మానించారు. తెలుగు ఉపాధ్యాయురాలు పద్మజ, వ్యాయామ ఉపాధ్యాయురాలు విజయలక్ష్మీలను ఘనంగా సన్మానించారు. ఈ సన్మాన కార్యక్రమాన్ని ఉపాధ్యాయులతోపాటు ప్రధానోపాధ్యాయుడు గోపాలకృష్ణ ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు హరిప్రసాద్, అన్వర్ బాషా, ప్రమీల, ప్రసాద్ రావు, సుదర్శన్, కృష్ణకుమారి, శ్రీవాణిలతో పాటు పలువురు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సంబేపల్లెలో..



సంబేపల్లె : మండల పరిధిలోని రౌతుకుంట గ్రామంలోని హరిజనవాడ ప్రాథమిక పాఠశాలలో విధులు నిర్వహిస్తూ బదిలీపై వెళ్లిన అశోక్‌కుమార్‌రెడ్డి, ఇక్కడకి వచ్చినా నాగరాజులను బుధవారం సన్మానం నిర్వహించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, సిబ్బంది, విద్యార్థులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

రౌతుకుంటలో టీడీపీ ఇంటింటి ప్రచారం

సంబేపల్లె : టీడీపీ చేపట్టిన ఇంటింటి కార్యక్రమాన్ని బుధవారం మంత్రి రాంప్రసాద్‌రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా మండల పరిధిలోని దేవపట్ల, రౌతుకుంట గ్రామాలలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రభుత్వం ప్రజలకు అందిస్తున్న పథకాలను వివరించారు. టీడీపీ పాలనలో సంక్షేమం, అభివృద్ధి పరుగులు పెడుతోందన్నారు.

ఉపాధ్యాయుల కృషి ఎనలేనిది


సత్కారం అందుకుంటున్న ఉపాధ్యాయులు

సుండుపల్లె : తిమ్మసముద్రం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పనిచేస్తూ ఇటీవల బదిలీపై వెళ్లిన ప్రధానోపాధ్యాయులు రామచంద్ర రాజుకు, ఉపాధ్యాయులు ఉమాశంకర్, రమేష్‌లకు పాఠశాల సిబ్బంది బుధవారం శాలువా కప్పి పూలమాలలతో ఘనంగా వీడ్కోలు పలికారు. ఈ సందర్భంగా హెచ్‌ఎం చంద్రశేఖర్ మాట్లాడుతూ బదిలీ అయిన ఉపాధ్యాయులు పాఠశాల అభివృద్ధికి ఎనలేని కృషి చేశారన్నారు. కార్యక్రమంలో పాఠశాల విద్యా కమిటీ ఛైర్మన్ గుండమ్మ, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

వసతి గృహం తనిఖీ

ఒంటిమిట్ట : మండల కేంద్రమైన ఒంటిమిట్టలోని సాంఘిక సంక్షేమ బాలుర వసతి గృహాన్ని సీనియర్ సివిల్ జడ్జి కడప ఎస్.బాబా ఫక్రుద్దీన్ బుధవారం తనిఖీ చేశారు. హాస్టల్ పరిసరాలు, జీవన పరిస్థితులను, భద్రత, ఆరోగ్య, పరిశుభ్రత, ఆహారం, టాయిలెట్లు, వసతి గదులు, వంట శాల పరిసరాలను, మౌలిక సదుపాలయాలను ఆయన పరిశీలించారు. ఏవైనా సమస్యలు ఉంటే జిల్లా న్యాయ సేవాధికార సంస్థ, కడప వారి దృష్టికి తీసుకు రావచ్చని అన్నారు. ఈ కార్యక్రమంలో వార్డెన్ శివశంకర్, పాల్గొన్నారు.

గాలివీడులో గుప్పుమంటున్న గంజాయి!

- యువకులు, విద్యార్థులే టార్గెట్
- నిర్మానుష్య ప్రదేశాలే అడ్డాలు



గాలివీడు : భావితరాలకు మార్గదర్శకంగా ఉండాల్సిన నేటి యువత గంజాయి ఊబిలో చిక్కుకొని వారి జీవితాలను నాశనం చేసుకుంటున్నారు. జీవితంలో నిర్ణీత లక్ష్యాలతో ముందుకు సాగాల్సిన వారు గంజాయికి బానిసలుగా మారుతున్నారు. చాలాచోట్ల ఆల్కహాల్ తరవాత ఎక్కువ మంది గంజాయి వ్యసనపరులుగా మారుతున్నారు. అందులో ముఖ్యంగా యువత ఉన్నారు.

బాగా చదువుకొని పైకి రావాల్సిన టీనేజర్లు ఈ గంజాయి మత్తుకు బానిసలు అవుతున్నారు. వీరంతా సాయంత్రం వేళలో కలుసుకుని ఖాళీ ప్రదేశాలు, వెంచర్లను అడ్డాగా మార్చుకొని గంజాయిని సేవిస్తున్నారు. ఎక్కువ శాతం 17 యేళ్ల నుంచి 25 ఏళ్ల వయసు లోపు వారే వీటికి బానిసలు అవుతుండడం గమనార్హం. కొంతమంది యువకులైతే ఈ గంజాయి మత్తులో లేనిపోని గొడవలకు దిగుతూ వారి ఇంటి వారికి భారంగా మారుతున్నారు. మరి కొంతమంది ఈ మత్తులో ఇతర నేరాలకు పాల్పడుతూ తమ జీవితాలను నాశనం చేసుకుంటున్నారు.

మత్తుకు బానిసలు అవుతున్న యువత

గంజాయి, డ్రగ్స్ వంటి మత్తు పదార్థాలకు యువత బానిసలు అవుతున్నారు. చిన్న వయసులోనే గంజాయికి అలవాటు పడి తమ జీవితాలను పోగొట్టుకుంటున్నారు. గంజాయి వాడకం అనంతరం గ్రూపులుగా ఏర్పడి గొడవలకు దిగి ప్రాణాల మీదకు తెచ్చుకుంటున్నారు. ముఖ్యంగా గాలివీడు పట్టణంలోని పెద్దూరు, బస్టాండ్, గేటు నాలుగురోడ్ల కూడలి, కరిమిరెడ్డిగారి పల్లె తదితర ప్రాంతాలు గంజాయి స్థావరాలుగా మారాయి. గంజాయిని పీల్చేందుకు బొప్పాయి చెట్టు ఆకుల బొంగులను వినియోగిస్తూ, వాటి కోసం బొప్పాయి చెట్ల వద్ద గంజాయి బ్యాచ్ ఎక్కువగా ప్రత్యక్షమవుతున్నారు.

నిర్మానుష్య ప్రదేశాలే అడ్డాలు

గంజాయి అమ్మకాలు, కొనుగోలు నిర్మానుష్య ప్రదేశాలను అడ్డాలుగా మార్చుకున్నారు. పట్టణ శివారు ప్రాంతాల్లో గంజాయి విక్రయిస్తున్నారు. ముఖ్యంగా గాలివీడు పట్టణంలోని రాయచోటి ప్రధాన రహదారి వెంబడి పంట పొలాలు, వెలిగల్లు కుడి కాలువ బ్రిడ్జ్ వద్ద, పట్టణ శివారు ప్రాంతాల్లో గుట్టల్లో వీరి స్థావరాలను ఏర్పరచుకున్నట్లుగా సమాచారం. పోలీసులు ఎప్పటికప్పుడు నిర్మానుష్య ప్రదేశాలలో నిఘా ఏర్పాటు చేయాలని మండల వాసులు కోరుతున్నారు. కొందరు వ్యక్తుల సహకారంతో బయట ప్రాంతాల నుంచి గంజాయిని తరలించి విక్రయాలు చేపడుతున్నట్లుగా సమాచారం.

ఆరోగ్యంపై చెడు ప్రభావం

గంజాయికి అలవాటుపడిన యువకులు.. చివరకు అది లేకుండా తాము ఉండలేమనే స్థితికి చేరుకుంటారని వైద్యులు చెబుతున్నారు. ఆ మత్తులో చెడు వ్యసనాలకు, నేరాలకు పాల్పడుతున్నారు. కొంత మంది తల్లిదండ్రులు తమ పిల్లలు ఏం చేస్తున్నారనే విషయాన్ని గమనించకపోవడంతో వారు చెడు సావాసాలతో గంజాయికి బానిసలవుతున్నారు. గంజాయి సేవించే వారికి చేతులు, కాళ్లు వణకడం, మాట తడబడటం చివరకు మానసిక వైకల్యంతో బాధపడే ప్రమాదం ఉందని వైద్యులు హెచ్చరిస్తున్నారు. పట్టణానికి చెందిన కొంత మంది యువకులు ఇలాంటి స్థితిలో అక్కడక్కడ తారసపడుతుండటం గమనార్హం.

మాదకద్రవ్యాలపై ఉక్కుపాదం

మండల పరిధిలో ఎక్కడైనా మాదకద్రవ్యాల వినియోగం జరుగుతున్నట్లు మా దృష్టికి తెస్తే కఠిన చర్యలు తీసుకుంటాం. ఇప్పటికే మండల కేంద్రం శివారు ప్రాంతాల్లో నిఘా పెంచాం. పట్టణ శివారులో సిబ్బంది విస్తృతంగా తనిఖీలు నిర్వహిస్తున్నారు.

– రామకృష్ణ, ఎస్‌ఐ, గాలివీడు

ముఖ్యమంత్రి వద్దకు రాయచోటి పంచాయతీ


చంద్రబాబును కలిసిన సుగవాసి ప్రసాద్ బాబు

రాయచోటి : అన్నమయ్య జిల్లా కేంద్రం రాయచోటి టీడీపీ పంచాయతీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు దగ్గరకు చేరింది. పార్టీ అధినేతల పిలుపు మేరకు టీడీపీ కార్యనిర్వాహక కార్యదర్శి సుగవాసి ప్రసాద్ బాబు బుధవారం సీఎం చంద్రబాబు ను కలిశారు. ఈ సందర్భంగా పార్టీలో సుగవాసి కుటుంబానికి జరుగుతున్న అన్యాయంపై ఆధారాలతో సహా వివరించినట్లు సమాచారం. రాజంపేట అసెంబ్లీ అభ్యర్థిగా పోటీ చేసిన సుగవాసి సుబ్రమణ్యంను ఓడించడంలో కీలకపాత్ర పోషించిన వారిపై కూడా చంద్రబాబుకు మరోమారు వివరించినట్లు తెలిసింది. తండ్రి మాజీ ఎమ్మెల్యే సుగవాసి పాలకొండ్రాయుడు మరణం సమయంలో.. ఆ తరువాత జరిగిన పరిణామాలు పార్టీలోనే సీనియర్ నాయకులకు జరుగుతున్న అన్యాయాలను ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లారు. జిల్లాలో టీడీపీలోని కీలక నేతలు చేస్తున్న దౌర్జన్యాలు, అవినీతి అక్రమాలపై స్పందించడం పైనే బాల సుబ్రమణ్యంపై రాజకీయంగా కక్ష పెంచుకొని తీవ్ర ఇబ్బందులకు గురి చేశారంటూ జిల్లాకు చెందిన మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి, పార్టీ అధ్యక్షులు జగన్ మోహన్ రాజులపై ఫిర్యాదు చేసినట్లు కూడా సమాచారం. అలాగే జిల్లాలోని పలు అంశాలపై చర్చించినట్లు తెలియవచ్చింది. సమస్యలను విన్న ముఖ్యమంత్రి త్వరలోనే అన్ని కార్యక్రమాలను చక్కబెడతామని, పార్టీ అభివృద్ధికోసం కృషి చేయాలని ప్రసాద్ బాబుకు చెప్పినట్లు సమాచారం.

మోటకట్లలో పర్యటించిన శ్రీకాంత్‌రెడ్డి

సంబేపల్లె : మండల పరిధిలోని మోటకట్ల గ్రామంలో నెలకొన్న సమస్యలపై వైఎస్ఆర్‌సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గడికోట శ్రీకాంత్‌రెడ్డి బుధవారం ఆరా తీశారు. అనంతరం వైఎస్ఆర్‌సీపీ కార్యకర్త రెడ్డి మాతృమూర్తి పార్వతమ్మ దశదిన కర్మ కార్యక్రమంలో పాల్గొని ఆమె చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. అనంతరం గ్రామస్తులతో మాట్లాడారు. ఖరీఫ్ ప్రారంభమైన సందర్భంగా రైతులను వ్యవసాయ పనుల గురించి అడిగి తెలుసుకున్నారు. కూటమి ప్రభుత్వంలో రైతులు పడుతున్న ఇబ్బందులను ఆయన దృష్టికి తీసుకెళ్లారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ వెంకటేశ్వర్‌రెడ్డి, షేక్ వెంకట్రామిరెడ్డి, పి.అమరనాథ్‌రెడ్డి, జగన్నాథ్‌రెడ్డి, ప్రతాప్‌రెడ్డి, రమణారెడ్డి, ప్రముఖ న్యాయవాది రమేశ్‌రెడ్డి, అమరనాథ్‌రెడ్డి, మధుసూదన్‌రెడ్డి, భానుమూర్తిరెడ్డి, మురళీమోహన్‌రెడ్డి, పవన్‌కుమార్‌రెడ్డి, శ్రీను, భూషణ, శివప్రసాద్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పంటలకు గిట్టుబాటు ధరలు లేవు

కూటమి ప్రభుత్వంలో ఎదుర్కొంటున్న గోడును మాజీ ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డికి మొరపెట్టుకున్న రైతులు


గువ్వలచెరువులో పర్యటిస్తున్న శ్రీకాంత్‌రెడ్డి

రామాపురం (రాయచోటి జగదాంబసెంటర్) : రామాపురం మండలం గువ్వలచెరువు గ్రామం హరిజనవాడలో బుధవారం వైఎస్ఆర్‌సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గడికోట శ్రీకాంత్‌రెడ్డి పర్యటించారు. ఆత్మీయ అనురాగాలతో పేరుపేరునా అందరినీ పలుకరించి, వారి యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. అక్కడి రైతులు, ప్రజలతో మమేకమయ్యారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ అదును దాటిపోతున్నా సరైన వర్షాలు కురవలేదని శ్రీకాంత్‌రెడ్డి ఎదుట ఆవేదన వ్యక్తం చేశారు. పండించిన ఏ పంటకూ గిట్టుబాటు ధర లేదని మొరపెట్టుకున్నారు. రైతులు కష్టాలు పడుతుంటే కూటమి ప్రభుత్వం రైతు భరోసాను సైతం అందివ్వలేదని, పాల రేట్లు తగ్గాయని, ప్రభుత్వం నుంచి ఏ పథకం అందడం లేదని వారు శ్రీకాంత్‌రెడ్డి ఎదుట వాపోయారు. ప్రజలకు ఏ కష్టం వచ్చినా తాము అండగా ఉంటామని శ్రీకాంత్‌రెడ్డి భరోసానిచ్చారు. అనంతరం హరిజనవాడకు చెందిన వైఎస్ఆర్‌సీపీ కార్యకర్త శివ అపెండెక్స్ ఆపరేషన్ చేయించుకుని ఇంటి వద్ద విశ్రాంతి తీసుకుంటుడటంతో శ్రీకాంత్‌రెడ్డి పరామర్శించి ఆరోగ్య పరిస్థితులను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో సర్పంచులు సుబ్బయ్య, ఆయూబ్, ఎంపీటీసీ మౌలా, మాజీ సర్పంచ్ ముబారక్, డా.రమణ, కో–ఆప్షన్ జిలాన్, సుబ్బయ్య, సిరాజ్, ఫయాజ్, ఓబులేసు, రాజా, అలీ, యువనాయకులు అయోధ్యపురం పవన్‌కుమార్‌రెడ్డి, బలరాం, శ్రీను, మల్లయ్య, లక్ష్మీనారాయణ, ప్రసాద్, బసయ్య, దొరబాబు, సగినాల శివశంకర్, జోహర్‌అలీ, జన, జాబురుల్లీ తదితరులు పాల్గొన్నారు.

చెరువు ఆక్రమణపై కలెక్టర్‌కు ఫిర్యాదు

సుండుపల్లె : మండల పరిధిలోని చిన్నగొల్లపల్లి గ్రామ పంచాయతీ పూజారివాండ్లపల్లె సమీపంలోని పెద్దచెరువు ఆక్రమణకు గురైందని అదే గ్రామానికి చెందిన పూజారి రామాంజులు, శ్రీనివాసులు బుధవారం కలెక్టర్ చామకూరి శ్రీధర్‌కు ఫిర్యాదు చేశారు. ఫిర్యాదుదారులు తెలిపిన వివరాల మేరకు.. పూజారివాండ్లపల్లె సమీపంలో పెద్దచెరువు కింద సుమారు 200 ఎకరాలకు పైగా ఆయకట్టు ఉందని, ఆ గ్రామంలోని కొందరు వ్యక్తులు చెరువును కబ్జా చేసి బోరు వేసి పంటలు సాగు చేసుకుంటున్నారని చెప్పారు. జిల్లా ఉన్నతాధికారులు విచారణ చేపట్టి ఆక్రమణలను తొలగించి గ్రామస్తులకు ఇబ్బంది లేకుండా చూడాలని కలెక్టర్‌ని కోరినట్టు తెలియజేశారు.

వ్యాధులు రాకుండా జాగ్రత్తలు పాటిద్దాం

సిద్దవటం : వ్యాధులపై అవగాహన ఉంటేనే వాటిని రాకుండా జాగ్రత్త పడవచ్చని అడిషనల్ జిల్లా వైద్యాధికారి డాక్టర్ రవిబాబు తెలిపారు. బుధవారం ఆయన మండలంలోని చాముండేశ్వరీపేట గ్రామ సమీపంలో ఉన్న సెయింట్ ఆంథోని హైస్కూల్‌లో విద్యార్థులకు నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. జూలై 1వ తేదీ నుంచి 30వ తేదీ వరకు డెంగ్యూ మాసోత్సవాలు జరుగుతున్నాయన్నారు. విద్యార్థులు, పాఠశాల అధ్యాపక బృందానికి డెంగ్యూ వ్యాధిపై పలు సూచనలు, సలహాలు చేశామన్నారు. క్షయ లక్షణాలు తెలియజేసి, అనుమానం ఉన్నవారు పరీక్షలు చేయించుకొని, నిర్ధారణ అయితే చికిత్స పొందాలన్నారు. అనంతరం జాతీయ టీకా విధానంపై సమీక్షించారు. అలానే మాధవరం పీహెచ్‌సీని తనిఖీ చేసి ల్యాబ్, టీకాల రిజిస్టర్‌లను పరిశీలించి వైద్య సిబ్బందితో సమావేశమయ్యారు. కార్యక్రమంలో డాక్టర్ శివకుమార్, సూపర్‌వైజర్లు నాగవల్లి, జ్యోతికళ, రమణయ్య, యానాదయ్య, ఏఎన్‌ఎం ఖుర్షీద్, ఆశ కార్యకర్తలు పెంచలమ్మ, శకుంతల, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

గంధపు పీర్లకు ప్రత్యేక పూజలు


గంధపు పీర్లకు ప్రత్యేక పూజలు చేస్తున్న భక్తులు

చిన్నమండెం : రాయలసీమలోనే ప్రసిద్ధిగాంచిన చిన్నమండెం మొహర్రం ఉత్సవాలలో భాగంగా గంధపు పీర్లకు ప్రత్యేక పూజలను భక్తులు నిర్వహించారు. ఈ నెల 5వ తేదీన నిర్వహించే మొహర్రం ఉత్సవాలలో భాగంగా పీర్లమకాన్‌లో కొలువుతీరిన గంధపు పీరుకు బుధవారం ప్రత్యేక పూజలను భక్తులు చేశారు. పలువురు పీర్లకు చదివింపులు చదివించారు. ఈ నెల 5వ తేదీ జరిగే కార్యక్రమానికి కడప పెద్ద దర్గా గురువు హజరత్ ఆరీఫుల్లా హుస్సేని పాల్గొననున్నట్లు నిర్వాహకులు తెలిపారు. పోలీసులు పీర్లచావిడి వద్ద ప్రత్యేక బందోబస్తును ఏర్పాటు చేశారు.

న్యూమరాలజీలో మహర్షికి డాక్టరేట్


డాక్టరేట్ అందుకుంటున్న మహర్షి

లక్కిరెడ్డిపల్లి : సంఖ్యా శాస్త్ర జ్యోతిష్యం(న్యూమరాలజీ)లో అప్పకొండయ్యగారిపల్లి వాసి మహర్షి డాక్టరేట్ అందుకున్నారు. విశ్వజ్యోతి జ్యోతిష్య విజ్ఞాన సంస్థ ఆధ్వర్యంలో జూన్ 15వ తేదీన జరిగిన ఆధ్యాత్మిక కార్యక్రమంలో డాక్టరేట్ అందుకున్నట్లు తెలిపారు. సంఖ్యా శాస్త్రం ద్వారా మన వ్యక్తిగత జీవితం, గమ్యస్థానం ఏంటో తెలియజేసి అందులో ఎలా రాణించాలో తెలియజేసేదే సంఖ్యా శాస్త్ర జ్యోతిష్యమని అన్నారు. సంఖ్యాశాస్త్ర జ్యోతిష్యం ద్వారా ప్రజలకు ఎంతో మేలు జరుగుతుందన్నారు. సంఖ్యాశాస్త్రంలో డాక్టరేట్ అందుకున్న మహర్షిని బంధువులు, గ్రామస్తులు అభినందించారు.

అయ్యప్పకు ఉత్తరా నక్షత్ర పూజలు



రాజంపేట రూరల్ : పట్టణ శివారులోని మణికంఠనగర్‌లోని శ్రీ అయ్యప్పస్వామి దేవస్థానంలో బుధవారం ఉత్తరా నక్షత్రాన్ని పురస్కరించుకొని అభిషేకాలు, ప్రత్యేక పూజలను నిర్వహించారు. ఆలయ కమిటీ, వేదపండితుల ఆధ్వర్యంలో స్వామి మూలవిరాట్‌కు పండ్లు, పాలు, పెరుగు, నెయ్యితో పాటు వివిధ సుగంధ ద్రవ్యాలతో అభిషేకములు జరిపారు. అనంతరం స్వామిని అలంకరించారు. సాయంత్రం హరిహర తనయుడి పల్లకి సేవలో భక్తులు పాల్గొన్నారు. భక్తులకు ఆలయ ప్రధాన అర్చకులు కొత్తపల్లి రాఘవేంద్రస్వామి తీర్థప్రసాదాలు అందజేసి ఆశీర్వదించారు.

గురువుల సేవలు వెలకట్టలేనివి


సన్మాన సభలో మాట్లాడుతున్న ఎంపీడీఓ

వీరబల్లి : ఉపాధ్యాయుడు అనే గురువు సేవలు మరువలేనివని ఎంపీడీఓ జవహర్ బాబు తెలిపారు. గత నెల 30వ తేదీన పదవీ విరమణ పొందిన రంగారెడ్డి, హనుమంతయ్య ఉపాధ్యాయులకు సన్మానసభ కార్యక్రమాన్ని బుధవారం ఏర్పాటు చేశారు. ఈ సమావేశంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న ఎంపీడీఓ జవహర్ బాబు మాట్లాడుతూ ఉపాధ్యాయుడి సేవలు వెలకట్టలేనివని తెలిపారు. సమాజంలో గుర్తింపు ఉన్న వ్యక్తి ఎవరంటే ఒక ఉపాధ్యాయుడేనని పేర్కొన్నారు. అనంతరం వారిని శాలువాలతో పూలమాలలతో సన్మానించారు.

దరఖాస్తుల ఆహ్వానం

లక్కిరెడ్డిపల్లి : లక్కిరెడ్డిపల్లిలోని ఏపీ మోడల్ స్కూల్‌లో ఆరో తరగతిలో మిగిలిన సీట్లకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపల్ వర్ల రమేష్ తెలిపారు. దరఖాస్తులకు చివరి తేదీ జూలై 5వ తేదీ అని తెలియజేశారు.

పాఠాలు చెప్పిన ఎంఈఓ


విద్యార్థులకు పాఠాలు చెబుతున్న ఎంఈఓ వరదయ్య

పెనగలూరు : పెనగలూరు మండలంలో బుధవారం పాఠశాలలో ఎంఈఓ గిరివరదయ్య ఉపాధ్యాయుడిగా అవతారం ఎత్తి విద్యార్థులకు పాఠాలు చెప్పారు. తిరుణంపల్లి పాఠశాలలో పనిచేస్తున్న ఉపాధ్యాయురాలు రాత్రికి రాత్రే సెలవు పెట్టడంతో బుధవారం ఉదయం పాఠశాల మూసివేయకుండా ఎంఈఓ వెళ్లి విద్యార్థులకు సాయంత్రం వరకు విద్యాబుద్ధులు నేర్పారు. తిరుణంపల్లి పాఠశాలలో ఒకే ఉపాధ్యాయురాలు ఉండటంతో ఆమె ఉన్నట్టుండి సెలవు పెట్టింది. మండలంలో అనేక పాఠశాలలో ఏకోపాధ్యాయులతో నడుస్తున్నాయి. ఇటీవల బదిలీలలో ప్రాథమిక పాఠశాలలోని ఉపాధ్యాయులు 77 మంది బదిలీపై వెళ్లారు. దీంతో ఒక్కో పాఠశాలలో ఒక్కో ఉపాధ్యాయుడే పనిచేయడం గమనార్హం. ఓబిలి, చక్రంపేటలతోపాటు మరికొన్ని పాఠశాలలో ఒక్క ఉపాధ్యాయుడు కూడా లేకపోవడంతో సీఆర్‌పీలు ఉపాధ్యాయులుగా విద్యార్థులకు పాఠాలు చెబుతున్నారు. నూతనంగా రావాల్సిన ఉపాధ్యాయులు రాకపోవడంతో ఒక ఉపాధ్యాయుడు ఉన్న పాఠశాలకు సెలవు పెడితే ఆ పాఠశాల మూసివేయాల్సిన పరిస్థితి ఏర్పడింది. పాఠశాలకు వెళ్లి పాఠశాల మూతపడకుండా విద్యాబోధన చేస్తున్నారు. ఉపాధ్యాయుల కొరత మండలంలో తీవ్రంగా ఉంది. ఉపాధ్యాయుల కొరత తీర్చి పాఠశాలలకు తగినంత మంది ఉపాధ్యాయులను ఉన్నతాధికారులు నియమించాలని మండలంలోని ప్రజలు కోరుతున్నారు.

సామూహిక అక్షరాభ్యాసం


విద్యాసామగ్రిని అందజేస్తున్న టీచర్లు

పుల్లంపేట : మండల పరిధిలోని దళవాయిపల్లి ఆదర్శ ప్రాథమిక పాఠశాలలో బుధవారం సామూహిక అక్షరాభ్యాస మహోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఒకటో తరగతి విద్యార్థులకు వారి తల్లిదండ్రులు పలకమీద అక్షరాలు రుద్దించి అక్షరాభ్యాసాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా మండల విద్యాధికారులు మాట్లాడుతూ ఇలాంటి కార్యక్రమాలు పిల్లలలో ఒక నూతన ఉత్సాహాన్ని నింపుతాయని, అమ్మ మొదటి దైవమని, కావున తల్లితో అక్షరాలు దిద్దించడం శుభసూచకమన్నారు. అనంతరం వారు విద్యార్థులకు విద్యార్థి మిత్ర కిట్లను అందజేశారు. తదుపరి ఉపాధ్యాయుడు రమణ మాట్లాడుతూ అక్షరాభ్యాస కార్యక్రమానికి దాత బోదనపు సిద్దు పిల్లలకు పలకలు, విద్యాసామగ్రి అందించడం గొప్ప విషయమన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

జాతీయ లోక్ అదాలత్‌ను జయప్రదం చేయండి


మాట్లాడుతున్న జడ్జి ప్రవీణ్‌కుమార్

రాజంపేట : ఈనెల 5వ తేదీజరిగే జాతీయ లోక్ అదాలత్‌ను జయప్రదం చేయాలని 3వ అదనపు జిల్లా జడ్జి ఎస్.ప్రవీణ్‌కుమార్ అన్నారు. బుధవారం కోర్టు ఆవరణలోని బార్ అసోసియేషన్ కార్యాలయంలో న్యాయవాదులతో లోక్ అదాలత్ నిర్వహణపై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ లోక్ అదాలత్‌ను కక్షిదారులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. అన్ని రకాలుగా రాజీ కాదల్చిన కేసులను రాజీ చేసి కక్షిదారులకు న్యాయం జరిగే విధంగా సూచనలను వివరించారు. సమావేశంలో సీనియర్ సివిల్ జడ్జి టి.కేశవ, జూనియర్ సివిల్ జడ్జి రాజాఉదయప్రకాశ్, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు హనుమంతునాయుడు, బార్ అసోసియేషన్ కార్యవర్గం సభ్యులు, న్యాయవాదులు, కోర్టు సిబ్బంది పాల్గొన్నారు.

మొక్కలు నాటి పచ్చదనాన్ని పెంపొందించాలి


నర్సరీలో పంపిణీకి సిద్ధంగా ఉంచిన మొక్కలు

సిద్దవటం : పచ్చదనాన్ని పెంపొందించేందుకు ప్రతి ఒక్కరూ మొక్కలను నాటి వాటిని పెంచాలని కడప రేంజర్ ప్రసాద్ తెలిపారు. ఈ సందర్భంగా బుధవారం ఆయన రాజీవ్ స్మృతివనంలో మాట్లాడుతూ కడప ఫారెస్టు రేంజి పరిధిలోని జేఎంజే కళాశాలకు ఎదురుగా ఉన్న రాజీవ్ స్మృతి వనంలోని నర్సరీలో వేప, నేరేడు, ఉసిరి, ఎర్రచందనం, కానుగ, నెమలి నారా, గన్నేరు, గుల్ మహల్ తదితర రకాలకు చెందిన 4 లక్షల మొక్కలను పెంచుతున్నామన్నారు. ఈ నెల 5వ తేదీన విద్యార్థులకు మొక్కలు అందజేసి నాటించే కార్యక్రమాన్ని చేపడుతున్నామన్నారు. కార్యక్రమంలో కడప ఫారెస్టు రేంజి సిబ్బంది పాల్గొన్నారు.

టౌన్ సర్వీసులు నడపాలి

రాయచోటి టౌన్ : అన్నమయ్య జిల్లా కేంద్రమైన రాయచోటిలో టౌన్ సర్వీస్ బస్సులు నడపాలని రాయచోటి మండల లీగల్ సర్వీసెస్ కమిటీ మాజీ సభ్యుడు యర్రపురెడ్డి విశ్వనాథరెడ్డి విజ్ఞప్తి చేశారు. రాయచోటి జిల్లా కేంద్రం కావడంతో జిల్లా కేంద్ర కార్యాలయాలు వివిధ ప్రాంతాలలో ఉన్నాయన్నారు. కడప రోడ్డులో, రాజంపేట రోడ్డులో, బైపాస్ రోడ్డులో, గాలివీడు రోడ్డులో ఇలా వివిధ ప్రాంతాలలో జిల్లా కార్యాలయాలు ఉన్నాయన్నారు. ఆయా కార్యాలయాలకు వెళ్లే సామాన్యులు చాలా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని చెప్పారు. ఆటోల ద్వారా వెళ్లాలంటే అధిక చార్జీలు వసూళ్లు చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కావున జిల్లా అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి వెంటనే టౌన్ సర్వీస్ బస్సులు నడపాలని వినతి చేశారు. ఆర్టీసీ బస్టాండ్ నుంచి రాయచోటి రింగ్ రోడ్డుపైన క్లాక్ వైస్, యాంటీ క్లాక్ వైస్‌తో పాటు రాయచోటి పట్టణంలోని ప్రధాన రోడ్ల వెంబడి టౌన్ సర్వీస్ బస్సులు నడపాలని కోరారు.

ప్రకృతి వ్యవసాయం ద్వారా అధిక దిగుబడులు

ఒంటిమిట్ట : ప్రకృతి వ్యవసాయం ద్వారా అధిక దిగుబడులు సాధించవచ్చని ఊటుకూరు కృషి విజ్ఞాన కేంద్రం సమన్వయకర్త డాక్టర్ ఎం వీరయ్య అన్నారు. కృషి విజ్ఞాన కేంద్రాల ద్వారా ప్రకృతి వ్యవసాయాన్ని పెంపొందించే కార్యక్రమానికి సంబంధించి బుధవారం ఒంటిమిట్ట మండల పరిధిలోని చింతరాజుపల్లి గ్రామంలో రెండురోజుల శిక్షణా కార్యక్రమంలో భాగంగా మొదటిరోజు కార్యక్రమాన్ని నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఊటుకూరు కృషి విజ్ఞాన కేంద్రం సమన్వయకర్త డాక్టర్ ఎ.వీరయ్య హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు ప్రకృతి వ్యవసాయంతో తక్కువ ఖర్చుతో అధిక దిగుబడి, అదనపు ఆదాయం పొందవచ్చన్నారు. ఆర్థిక, ఆరోగ్య ప్రయోజనాలు పొందవచ్చని, ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తులకు మార్కెట్‌లో డిమాండ్ పెరుగుతుందని, కావున నాణ్యతపరమైన ఉత్పత్తులను పెంపొందించడం కోసం రైతులు ఎంతో కృషి చేయాలని సూచించారు. అనంతరం వారు అరటిలో రకాలు, మొక్కల ఎంపిక, గెల యాజమాన్యం, సహజ పద్ధతులలో పోషక యాజమాన్యం, పురుగు తెగుళ్ల యాజమాన్యం గురించి, పసుపు విత్తిన తరువాత నుంచి కోత వరకు యాజమాన్య పద్ధతులు గురించి అవగాహన కల్పించారు.

పశువులకు సకాలంలో వైద్యసేవలు అందించాలి


పశువులకు వైద్య సేవలు అందిస్తున్న అధికారులు

వీరబల్లి : మండలంలోని మట్లి పంచాయతీలో నాయనవారిపల్లి, బిఎంఆర్ పల్లి పంచాయతీలలో బత్తినవారిపల్లిలో ఉండే రైతుల పశువులకు పశుసంవర్ధకశాఖ ఉపసంచాలకులు డాక్టర్ మాలకొండయ్య ఆధ్వర్యంలో బుధవారం వైద్య సేవలను అందించారు. 1240 గొర్రెలు, మేకలకు నట్టల నివారణ మందు వేశారు. అదే విధంగా మూడు నెలలు పైబడిన పాయదూడలకు, 157 ఆవులకు తైలేరియా వ్యాక్సిన్ తాపించారు. అనంతరం రైతులతో మాట్లాడుతూ సకాలంలో పశువులకు వైద్య సేవలు చేయించుకోవాలని, జాగ్రత్తలు పాటించాలని, అలాంటప్పుడే పశువుల నుంచి అధికంగా పాలు ఉత్పత్తి పెరుగుతుందన్నారు.

దండుకోవడమే టీడీపీ నాయకుల అజెండా..

- వైఎస్సార్ సీపీ నాయకుల ఆస్తులే టార్గెట్
- 40 ఏళ్లు సాగులో ఉన్న భూమిని స్వాధీనం చేసుకున్న కూటమి నాయకులు
- నిబంధనలకు నీళ్లొదిలిన రెవెన్యూ అధికారులు


స్వాధీనం చేసుకున్న భూమి వద్ద పోలీసులు

గాలివీడు : మండలంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక పలుచోట్ల అందినకాడికి దండుకోవడమే టీడీపీ నాయకుల అజెండాగా మారింది. మండల కేంద్రానికి కూతవేటు దూరంలో ఉన్న అరవీటి వాండ్లపల్లె జగనన్న కాలనీ దగ్గర వైఎస్సార్ సీపీ నాయకుడు, రైతు అరవీటి సుధాకర్ రెడ్డి కుటుంబ సభ్యుల పేరిట ఉన్న సర్వే నంబర్ 590/123 కు అనుకుని ఉన్న సాగుభూమిని అధికార పార్టీ నాయకులు యంత్రాల సహాయంతో స్వాధీనం చేసుకున్నారు. ఇందులో సర్వే నంబర్ 2415 లోని డీకేటీలో మరో వర్గం వారికి 1.03 సెంట్లు ఉందని అధికారుల అండతో 40 సంవత్సరాల తర్వాత ఏకంగా భూముల వద్దకు వచ్చి దందా చేస్తున్నారు. ఇదే సర్వే నంబర్ గుండా జగనన్న కాలనీకి రహదారి, గాలివీడు–పేరం పల్లెకు పురాతనమైన రహదారులు ఉన్నాయి. అప్పుడు రహదారులు మ్యాపు ద్వారా ఎవరెవరు అనుభవంలో ఉన్నాయో వారికి పూర్తిస్థాయి హక్కులు కల్పిస్తూ మ్యాపులు కూడా రైతులకు అందించారు. కాగా ఇన్నిరోజులు పంటలు సాగు చేసుకుని జీవించే రైతులకు ఇప్పుడు ఆ భూమిని వారు స్వాధీనం చేసుకోవడంతో దిక్కుతోచని స్థితిలో ఉన్నారు. అధికారం అండతో రెవెన్యూ అధికారులు కూడా సాగు చేసుకుంటున్న రైతులకు అన్యాయం చేశారే తప్ప నిబంధనలు మచ్చుకైనా పాటించలేదు. 40 సంవత్సరాల క్రితం పట్టా ఇస్తే మా అనుభవంలో ఉన్న భూమిని అప్పుడు మిన్నకుండిపోయి ఇప్పుడు స్వాధీనం చేసుకుంటున్నారు అని సాగురైతు సుధాకర్ రెడ్డి నిలదీస్తున్నారు. వెంటనే జిల్లా అధికారులు స్పందించి తగిన న్యాయం చెయ్యాలని సాగు రైతులు కోరుతున్నారు.